సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 29 । ఆగస్టు । 2024



క్రీడా కెరటాలు..! 8లో▸

క్రీడాపాఠశాలల విద్యార్థులు వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కథనం.



ఓటర్ల సర్దుబాటు..! 9లో▸

గత ఫిబ్రవరి 1న సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు జీపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. జిల్లాలో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

సీజనల్‌పై అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులు దూరం
- రిమ్స్‌లో అందుబాటులో వైద్యులు
- రోగులకు సరిపడా బెడ్లు
- జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: వర్షాకాలం అంటేనే.. వ్యాధుల కాలం.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి.. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతాయి.. కొన్ని రోజులుగా రిమ్స్‌లో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరిగింది... రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం.. వైద్యులతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయి...ఇటీవల కాలంలో దగ్గు, జ్వరం, ఇతర వ్యాధులతో జనాలు ఆస్పత్రికి వస్తున్నారు...వారందరినీ వైద్యులు పరీక్షించి వైద్య సేవలు అందిస్తున్నారు...రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు...సమీపంలోని పీహెచ్‌సీతో పాటు రిమ్స్ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందాలని రిమ్స్ వైద్యాధికారులు పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దాసరి కమలాకర్, అసోసియేట్ ప్రొఫెసర్, పిల్లల వైద్య నిపుణులు హేమలత, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్‌లతో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, రోగులు తమ సమస్యలను ఫోన్ ద్వారా వారి దృష్టికి తీసుకొచ్చారు. ఓపిగ్గా విన్న వైద్యాధికారులు సలహాలు, సూచనలు చేశారు. వారి మాటల్లోనే..



ప్రజలకు సూచనలు చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యాధికారులు

దోమకాటుకు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? – రవి, ఇచ్చోడ

రిమ్స్ డైరెక్టర్: నిల్వ ఉన్న వర్షపు నీటితో పాటు చెత్తాచెదారంలో దోమలు వృద్ధి చెందుతాయి. దోమల నివారణ కోసం ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలి. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదు. ఇంటి కిటికీలకు జాలీలు బిగించుకోవాలి. డ్రమ్ములు, కూలర్లు, కొబ్బరిబోండాలు, పాత టైర్లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

డెంగీ, చికున్‌గున్యా లక్షణాలు ఏమిటి? – ఎంబడి మధుసూదన్, మావల

రిమ్స్ డైరెక్టర్: ఒళ్లు, కీళ్ల నొప్పులు, తీవ్రమైన జ్వరం, నడుము నొప్పి, మూడు నుంచి ఏడు రోజుల వరకు జ్వరం తగ్గకుండా వస్తుంది. 48 గంటలు దాటితే వైద్యులను సంప్రదించాలి. చికున్‌గున్యాకు మొదట ఒళ్లునొప్పులు వస్తాయి. భయపడాల్సిన అవసరం లేదు. రిమ్స్‌తో పాటు ఆయా పీహెచ్‌సీల్లో వైద్యులు చికిత్సలు అందించడం జరుగుతుంది.

రిమ్స్‌లో జ్వరాల బాధితుల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారా? – మెట్టు సంతోష్, గుర్జా, గుడిహత్నూర్ మండలం

రిమ్స్ డైరెక్టర్: రిమ్స్‌లో జ్వరపీడితుల కోసం ప్రత్యేకంగా బెడ్లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం రిమ్స్‌లో 800 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రోజులుగా ఇన్ పేషెంట్లు 800 నుంచి 850 వరకు ఉంటున్నారు. జ్వరాలకు సంబంధించి 50 మంది పేషెంట్లు అడ్మిట్ కాగా పిల్లలు రోజుకు 40 మంది వరకు చేరుతున్నారు. ఓపీ 2వేల మంది వరకు వస్తున్నారు.

రిమ్స్‌లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. చాలామంది ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? – సృజన్‌తేజ, కైలాస్‌నగర్, ఆదిలాబాద్

రిమ్స్ డైరెక్టర్: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిమ్స్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఈ సమయంలో ఎవరైనా వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తే నా దృష్టికి తీసుకురావాలి. అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

రిమ్స్ ఆవరణలో ప్రైవేట్ మెడికల్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారు. తొలగించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? – రూపేష్, బేల

రిమ్స్ డైరెక్టర్: రిమ్స్ ప్రధాన గేటు వద్ద ఉన్న మెడికల్ నిర్వాహకులకు నోటీసు ఇచ్చాం. వారికి 2028 వరకు కొనసాగించేందుకు గతంలో అధికారులు అనుమతినిచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

రిమ్స్‌లో చేయించిన పరీక్షల ఫలితాలు సరిగ్గా ఉండటం లేదు. అర్హతగల ల్యాబ్ టెక్నీషియన్లు లేరనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీరేమంటారు? – అవినాష్, గూడ, బేల మండలం

రిమ్స్ డైరెక్టర్: రిమ్స్‌లోని ల్యాబ్‌లో అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్‌లతో పరీక్షలు చేయిస్తున్నాం. రిమ్స్‌లో పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీతో పాటు టీహబ్‌లో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.

మూడు రోజులుగా జ్వరం తగ్గడం లేదు. చికున్‌గున్యా జ్వరమేనా? – తిరుమల రాజేందర్, ఇచ్చోడ, రెడ్డికాలనీ

రిమ్స్ డైరెక్టర్: చికున్‌గున్యా అయితే మొదట ఒళ్లు నొప్పులు వస్తాయి. ఆ తర్వాత విపరీతమైన జ్వరం ఉంటుంది. వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ లేదా రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన వైద్య పరీక్షలు చేస్తారు. నిర్ధారించిన తర్వాత వైద్య సేవలు అందిస్తారు.

బేల పీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – హరీష్, బేల

రిమ్స్ డైరెక్టర్: ఈ విషయాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్తాం. వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తారు.

గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. చాలా మంది మంచానికే పరిమితమయ్యారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.
– ఉమేష్ వైద్య, తాంసి (కె)
– రాజా గౌడ్, కుంటాల (కె)
– సాబ్లే కేవల్‌సింగ్, కొర్టికల్, నేరడిగొండ మండలం

రిమ్స్ డైరెక్టర్: ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నాయి. సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలి. నిపుణులైన వైద్యులచే మాత్రమే వైద్య సేవలు పొందాలి. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్తాం. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

తాంసిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలి. అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.? – రాఘవేందర్, తాంసి

రిమ్స్ డైరెక్టర్: రౌండ్ ది క్లాక్ ఆస్పత్రి ఏర్పాటు విషయం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పరిధిలోకి వస్తుంది. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్



అడ్మిషన్‌పత్రం అందిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి కౌన్సెలింగ్ కొనసాగుతోంది. బుధవారం రెండో రోజు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కౌన్సెలింగ్ చేపట్టారు. అడ్మిషన్ పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. రిమ్స్‌కు 120 సీట్లు కేటాయించగా ఇందులో 15 సీట్లు ఆలిండియా కోటా కింద ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఐదుగురు విద్యార్థులు అడ్మిషన్ పొందారని, ఈనెల 29 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు భానుప్రకాష్, విజయలక్ష్మి, రవీందర్, రాకేష్ పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోథ్: వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రాథోడ్ కృష్ణ, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు లత, మాధవి, సబ్ యూనిట్ ఆఫీసర్ రవీందర్, కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ అనిత, మెడికల్ ఆఫీసర్ నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేస్రం నగేష్, ఆరీఫా మాట్లాడుతూ ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని దివ్యాంగుల కోటా మడిగెలకు రీటెండర్ నిర్వహించాలన్నారు. సదరం ధృవీకరణ పత్రాలకు కాలపరిమితి విధించకూడదని, పరిమితి విధిస్తే ఆ తేదీని సర్టిఫికెట్‌పై ముద్రించాలని కోరారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి వికలాంగుల శాఖను వేరు చేయాలని, దివ్యాంగుల కుటుంబాలకు అంత్యోదయ అన్నయోజన కార్డులను అందించాలని, రూ.6వేల పెన్షన్, రేషన్ కార్డులను జారీ చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మంత్రిని కలిసిన ఎంపీ



మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ

ఆదిలాబాద్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆర్అండ్‌బీ రోడ్ల పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పలు కారణాలతో నిలిచిపోయిన పనులు, నూతన వంతెనలు, రహదారుల నిర్మాణ ప్రతిపాదనల గురించి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నూతన రహదారులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్ సీరియస్

- అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలపై ఆరా



అక్రమాలపై పట్టింపేది?

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: జిల్లాలో అధికారిక అనుమతులు లేకుండా రియల్టర్లు అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తూ ప్లాట్లను విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన సామాన్యులు భవన అనుమతులు, రిజిస్ట్రేషన్ల కోసం తిప్పలు పడుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోనూ ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని వివరిస్తూ 'అక్రమాలపై పట్టింపేది' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. కథనంలో ప్రస్తావించిన అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలపై బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అక్రమ లేవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీహెచ్‌సీని సందర్శించిన ఐసీఎంఆర్ బృందం



బృందం సభ్యులతో ఆస్పత్రి సిబ్బంది

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీని బుధవారం ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిచర్స్) కేంద్ర, రాష్ట్ర బృందం సభ్యులు సందర్శించారు. సభ్యులు డాక్టర్ అమ్లిన్ శుక్లా, డాక్టర్ నిగైనాథన్ మాట్లాడుతూ నవజాత శిశు మరణాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యులు రాంబాబు, జితేంద్రరెడ్డి, ప్రవీణ్‌తో సమీక్ష నిర్వహించారు. వైద్యులు మనోజ్, మోహనసుందరి, సత్యసాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాంటీన్‌లు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షిషా



ఇచ్చోడలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఇచ్చోడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ప్రైవేట్ హోటళ్లతో పోటీపడాలని సూచించారు. సాధారణ పౌరులకు తక్కువ ఖర్చుతో ఇంటి భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. పథకాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఒక్కో క్యాంటీన్‌కు రూ.4 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, డెప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో పర్యటించిన కలెక్టర్

బోథ్: కలెక్టర్ రాజార్షి షా బుధవారం మండలంలో పర్యటించారు. పొచ్చెర జలపాతం వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనాన్ని, సీహెచ్‌సీని పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మోడల్‌స్కూల్‌లో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ ఉమేష్ రావు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ

కైలాస్‌నగర్: జిల్లాలో జ్వరాల నియంత్రణకు సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేఆర్‌కే కాలనీ, అంకోలి, యాపల్‌గూడ, న్యూ కుమ్మరివాడలో డెంగీ కేసులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్లలోనూ, ఖాళీ స్థలాల్లోనూ పిచ్చి మొక్కలు తొలగించాలని, పారిశుధ్యంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మెప్మా ద్వారా చేపట్టిన ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ హామీ నిలబెట్టుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కైలాస్‌నగర్: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్ వరకు మహా ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి సాయంత్రం వరకు నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని, బేసిక్‌పే (మినిమం టైంస్కేల్) అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. కానీ ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ముఖ్యమంత్రితో సహా మంత్రులను కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. తమను రెగ్యులరైజ్ చేసే వరకు దశలవారీగా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాష్, పార్థసారథి, వెంకటి, కవిత, మమత, దేవదర్శన్, ప్రవీణ్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దీక్ష అనంతరం సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఒడ్డి భోజన్న యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చందు, ప్రధాన కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా కేశవ్, అధికార ప్రతినిధిగా సోమన్న, ఉపాధ్యక్షులుగా ప్రదీప్, భరత్, దర్శన్, అనిల్, రాకేష్, మహిళా అధ్యక్షులుగా మమత, రత్న, సోషల్ మీడియా కార్యదర్శులుగా ఆర్.వెంకన్న, సురేందర్, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా అర్చన, వినోద్, యోగేష్, అర్చన, నాగలక్ష్మి, ప్రతి, కృష్ణవేణి వైద్యనాథ్, సంజీవ్, ముఖ్య సలహాదారులుగా రవీందర్, ప్రకాష్, వెంకటి, పార్థసారథిని ఎన్నుకున్నారు.

దొరికేస్తున్నారు..

- ఈనెల 25, 26 తేదీల్లో జిల్లాలో డ్రగ్స్ సేవించినట్లు ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. జిల్లాలో నమోదైన తొలి డ్రగ్ వినియోగ కేసులివే. ఆదిలాబాద్‌లో టుటౌన్‌లో ఒక కేసు, మరో కేసు జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైంది. ఇప్పటి వరకు జిల్లాలో మత్తు పదార్థాల రవాణా చేస్తూ, నిల్వ ఉంచి, సాగు చేస్తున్న కేసులు అధికంగా చూశాం. పోలీస్‌శాఖ డ్రగ్స్ వినియోగించిన వారి మత్తు వదిలించే పని మొదలుపెట్టింది.

- నూతన టెస్ట్ కిట్‌లతో పోలీసుల పరీక్షలు
- డ్రగ్ వినియోగించినట్లు నిర్ధారణ
- ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు, అరెస్టులు
- జిల్లాలో ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు



ఇటీవల డ్రగ్స్ టెస్ట్‌లో పట్టుబడిన వ్యక్తి

సాక్షి,ఆదిలాబాద్: డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఒకవైపు వీటిని విక్రయిస్తున్న వారి ఆట కట్టిస్తూనే.. మరో వైపు మత్తు బానిసల మత్తు వదిలించేందుకు పోలీసు శాఖ యాక్టివ్‌గా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇటీవల టీజీ న్యాబ్ ద్వారా జిల్లాకు డ్రగ్ టెస్ట్ కిట్లురాగా వాటిని ప్రతీ పోలీసు స్టేషన్‌కు పంపిణీ చేశారు. మనం ఇప్పటి వరకు రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేయడం చూశాం. ప్రస్తుతం గంజాయి, ఇతర డ్రగ్స్ వినియోగించే వారిని అనుమానం వస్తే పోలీసులు పరీక్షలు చేస్తున్నారు. అందులో పాజిటివ్ వస్తే వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తున్నారు. నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేస్తున్నారు. ఈ యాక్ట్ ప్రకారం కోర్టులో శిక్షలు ఖరారవుతాయి.

పరీక్ష ఇలా..

డ్రగ్స్ కిట్ వన్‌టైమ్ యూజ్ కావడంతో ఒకసారి పరీక్ష చేసిన తర్వాత మరొకరికి దాన్ని వాడరు. దీనికి సంబంధించి కొత్త కిట్‌లను ఎప్పటికప్పుడు తెప్పించుకోవాల్సి వస్తుంది. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు అనుమానం వస్తే పోలీసులు వారికి టెస్ట్ కిట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. అనుమానితుని మూత్రం సేకరించి ఈ టెస్ట్ కిట్‌లో పరీక్షిస్తారు. ఒక వేళ అతను డ్రగ్స్ వినియోగించి ఉంటే పాజిటివ్ అని, లేనిపక్షంలో నెగిటివ్ అని వస్తుంది. అంతే కాకుండా అతను ఏరకమైన మత్తు పదార్థం సేవించాడనేది కూడా అందులో స్పష్టం చేస్తుంది. ఒకవేళ గంజాయి తీసుకుంటే అందుకు సంబంధించి కెమికల్ నేమ్‌ను సూచిస్తుంది. లేనిపక్షంలో ఇతర మత్తు పదార్థాలు సేవించి ఉంటే దానికి సంబంధించిన పేరు ఆ కిట్ పరీక్షలో తేలిపోతుంది. ఒక వ్యక్తి డ్రగ్స్ సేవించిన తర్వాత నాలుగు రోజుల వరకు దాని ప్రభావాన్ని ఈ టెస్ట్ కిట్లు గుర్తిస్తాయి. ఇవి పోలీసులకు ఒక ఆధారంగా మారాయి. తద్వారా మత్తు పదార్థాలు వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టులో ఆధారాలతో నిందితున్ని ప్రవేశ పెట్టడం ద్వారా శిక్షలు పడేందుకు ఆస్కారం ఉంది.

యువతపై దృష్టి..

డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోంది. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో మత్తుపదార్థాల ఉత్పత్తి, తయారీ, సాగు, స్వాధీనం, అమ్మకం, కొనుగోలు, రవాణా, నిల్వ వినియోగాన్ని నిషేధించడం జరిగింది. అంతే కాకుండా యువత దీని ప్రభావానికి అధికంగా గురవుతున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి నార్కోటిక్ వింగ్‌ను విస్తతం చేస్తోంది. హైదరాబాద్ వంటి నగరంలో బ్రౌన్ షుగర్, నికోటిన్ ఇతర మత్తు పదార్థాల వినియోగం జరుగుతుండగా జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు గంజాయి కేసులు బయటకు వచ్చాయి.

డ్రగ్స్ నియంత్రణకు చర్యలు



డ్రగ్స్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు పోలీసు శాఖ పరంగా విస్తృతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అందులో భాగంగానే టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. అంతే కాకుండా జిల్లాలో గంజాయి సాగు చేసే వారిపై చర్యలు చేపడుతున్నాం.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్



బంజారా యువతులు, మహిళలతో ఎమ్మెల్యే



నెత్తిన బుట్టలతో యువతులు



నృత్యం చేస్తున్న యువతులు

ముగిసిన తీజ్ ఉత్సవాలు



బుట్టలు ఎత్తుకున్న యువతులు

బంజారాల ప్రధాన పండుగల్లో ఒకటైన తీజ్ ఉత్సవాలు జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం ఘనంగా ముగిశాయి. సంప్రదాయ గీతాలు, నృత్యాలతో చిన్నారులు, యువతులు, మహిళలు తీజ్ (గోధుమ మొలకలు) లతో నృత్యం చేశారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి విన్నవిస్తానన్నారు. ప్రకృతిని పూజించడం ద్వారానే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కౌన్సిలర్లు పవన్ నాయక్, రఘుపతి, ముకుందరావు, వేదవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్



నెత్తిన తీజ్‌తో యువతి

క్లుప్తంగా

రిమ్స్ ఎదుట ఆక్రమణలు తొలగింపు


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ప్రధాన గేటు ఎదుట ఉన్న ఆక్రమణలను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి బుధవారం తొలగించారు. వీటి వల్ల రిమ్స్‌లోకి వాహనాలతో పాటు అంబులెన్స్‌లు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రిమ్స్ ఎదుట గల రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలను మున్సిపల్ అధికారుల ద్వారా తొలగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని దుకాణ యజమానులకు సూచించారు. రోడ్డుపైకి వచ్చేలా షెడ్లు వేయవద్దని సూచించారు. డీఎస్పీ వెంట ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బార్‌లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గల సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. బార్ షట్టర్‌ను పగలగొట్టి దొంగలు బార్‌లోనికి ప్రవేశించారు. మొదటగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, కౌంటర్‌లో ఉన్న రూ.30వేల నగదు, రూ.5 వేల విలువ గల 7 మద్యం బాటిళ్లను అపహరించారు. బుధవారం ఉదయం బార్ షట్టర్ తీయడానికి వచ్చిన యజమాని తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడా కెరటాలు..!

- సత్తా చాటుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

ఆదిలాబాద్: ప్రస్తుతం చదువులకు ఉన్న ప్రాధాన్యత క్రీడలకు దక్కడం లేదు. దీంతో సామర్థ్యం ఉన్నా విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని, ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడాపాఠశాలలను నిర్మించింది. సత్తా ఉన్న విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే క్రీడల్లో వారిని మెరికల్లా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసింది. కాగా ఈ పాఠశాలల్లోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. పలు క్రీడాంశాల్లో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భారత క్రీడా ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భవిష్యత్తు క్రీడాకారుల గురించి 'సాక్షి' కథనం..


ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాల

జూడోలో అలేఖ్య సత్తా



క్రీడా పాఠశాలకు చెందిన కొంపెల్లి అలేఖ్య ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జూడోలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. వరంగల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకంతో మెరిసింది. కేరళలోని త్రిసూర్‌లో నవంబర్‌లో గత సంవత్సరం జరిగిన సౌత్ జోన్ ఎస్జీఎఫ్ఐ పోటీల్లో గోల్డ్‌మెడల్ పొందింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -గోవా కేంద్రంలో ప్రత్యేక శిక్షణకు ఎంపికైంది. ప్రస్తుతం గోవాలో శిక్షణ తీసుకుంటుంది.

రేస్‌వాక్‌లో మెరిక



క్రీడా పాఠశాలకు చెందిన స్ఫూర్తి అథ్లెటిక్స్‌లో భాగమైన రేస్ వాక్ ఈవెంట్‌లో సత్తా చాటుతోంది. రేస్ వాక్ ఈవెంట్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ -2023 పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించి శభాష్ అనిపించుకుంది.

బాక్సింగ్ ఆశా కిరణం షోయబ్



క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షోయబ్ మాలిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నాడు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని లాలాగూడలోని రైల్వే స్టేడియంలో జరిగిన తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో 52 -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. నోయిడాలో మూడవ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదగడమే తన లక్ష్యమని షోయబ్ పేర్కొంటున్నాడు.

పతకాల ఆనంది



పదవ తరగతి చదువుతున్న ఆనంది 400 మీటర్ల పరుగుల పోటీల్లో విజేతగా నిలుస్తోంది. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. 2023లోనే హన్మకొండలో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో రజక పతకంతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల సరూర్‌నగర్ స్టేడియంలో మూడవ జాతీయ జావెలిన్ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది.

పరుగుల యువ'రాజ్'



క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యువరాజ్ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 100 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచాడు. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన యువకుడు

నిర్మల్‌టౌన్: ఆటో బైక్ ఢీకొన్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆటో డ్రైవర్ షేక్ సోహెల్ నిర్మల్ బస్టాండ్ నుంచి ప్యాసింజర్లతో విశ్వనాథ్‌పేట్‌కు వెళ్తున్నాడు. ఎదురుగా బైక్‌పై వచ్చిన సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్, రంకుల వెంకటరమణ, మర్రి లాస్మన్నలు అతివేగంగా ఆటోను ఢీకొట్టారు. దీంతో బైక్ కిందపడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

భార్య మరణం తట్టుకోలేక భర్త మృతి


బండెవార్ పోశెట్టి (ఫైల్)

తానూరు: ఎన్నో ఏళ్లుగా కలిసి ఉన్న భార్య మృతిని తట్టుకోలేని భర్త మనస్తాపంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బండేవార్ పెంటుబాయి (88), పోశెట్టి (92) వృద్ధ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా పెంటుబాయి సోమవారం రాత్రి అనార్యోగంతో మృతి చెందింది. భార్య మృతిని తట్టుకోలేక ఆమె భర్త పోశెట్టి సైతం మంగళవారం రాత్రి మృతిచెందాడు. కాగా వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా వారందిరికి వివాహాలు జరిగాయి. రోజు వ్యవధిలో ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

యాసతోనే భాష మనుగడ

- స్థానిక మాండలికంతోనే భాష మనుగడ సాధ్యం
- జిల్లా కవుల వాడుకభాష శైలి విభిన్నం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: తెలుగు భాష తీయదనం.. తెలుగు భాష గొప్పదనం.. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఓ మూలధనం.. అన్నాడో సినీ కవి. నిజానికి తెలుగు భాష మాధుర్యం ఎంతో గొప్పది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు పది కోట్లకు పైగా మంది తెలుగు భాష మాట్లాడుతున్నారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో ఒకటిగా వెలుగొందుతున్న తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష. ఆంధ్రప్రదేశ్ అధికారిక భాష చట్టం ద్వారా 1966లో తెలుగును రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించింది. ఏటా ఆగస్టు 29న తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతి నేపథ్యంలో తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.


పదోతరగతి విద్యార్థులు రచించిన తెలుగు నీతికథల పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం (ఫైల్)

తెలుగు నీతి కథలతో కూడిన పుస్తకం

తెలుగు భాషపై అమితమైన అభిమానంతో ఏకంగా తెలుగు నీతి కథలతో కూడిన పుస్తకాన్ని రాశారు విద్యార్థులు. దాదాపు 15 సంవత్సరాల వయసు కలిగిన పదో తరగతి విద్యార్థులు 19 మంది కలిసి ఏకంగా కథల సంపుటి రాశారు. నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం వెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదవ తరగతి చదివిన విద్యార్థులు దాదాపు 20 కథలను రాసి దాన్ని గ్రంథస్తం చేసి పుస్తకంగా ప్రచురించారు. తెలుగు భాషపై ఉన్న అమితమైన మక్కువతోనే పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పోతన్న ప్రోత్సాహం, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ తోడ్పాటుతో విద్యార్థులు గ్రంథస్తం చేయడం భాషపై వారికి ఉన్న ఆసక్తిని, అనురక్తిని చాటుతోంది.

'గిడుగు' చెప్పిందేమంటే..


గిడుగు రామమూర్తి పంతులు (ఫైల్)

ప్రముఖ తెలుగు సాహితీవేత్త, వ్యవహారిక భాష పితామహుడు, వాడుక భాష కోసం ఉద్యమం సాగించిన గిడుగు వేంకట రామమూర్తి పంతులు మొదటి నుంచి గ్రాంధిక భాషను కాకుండా పల్లె జనం, సాధారణ ప్రజానీకం మాట్లాడుకునే వ్యవహారిక భాషను మనుగడలో ఉంచాలని అనేక ప్రయత్నాలు సాగించారు. ఆయన సాగించిన ఉద్యమం నుంచే ప్రస్తుత వాడుక భాష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎంత నగరీకరణ జరిగినా, పామరుడుకి అర్థమైనప్పుడే భాషకు విలువ అని నొక్కి చెప్పారు. తన చివరి శ్వాస వరకు వాడుక భాషకే జీవం పోశారు.

వృత్తి వైద్యం.. ప్రవృత్తి కవిత్వం


డా. అప్పాల చక్రధారి, సాహితీవేత్త

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు, సాహితీవేత్త అప్పాల చక్రధారి. చిన్నపిల్లల వైద్య నిపుణులుగా పనిచేసే వీరు సామాన్య పాఠకులకు అర్థమయ్యే రీతిలో సరళమైన శైలిలో కవిత్వం రాస్తున్నారు. సామాజిక స్పృహ కథాంశాలను కవిత వస్తువులుగా తీసుకొని చెప్పదలుచుకున్న అంశాన్ని బలంగా, నిరాడంబరంగా స్పష్టంగా తెలియపరుస్తారు. తెలుగు భాషలోని స్థానిక మాండలిక తెలంగాణ యాస, వ్యవహారికంలోనే ఆయన కవితలు ఉంటాయి.

భాషాభిమానంతోనే రోజుకో కవిత


అంబటి నారాయణ

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు అంబటి నారాయణ ప్రతీరోజు ఓ కవిత రాస్తూ నిత్య కవితా చైతన్యుడిగా పేరొందుతున్నారు. తెలుగు అక్షరధనంతోనే అజ్ఞానాన్ని పారదోలుతామని, తెలుగు భాషతోనే అమృతహస్తాన్ని అందిస్తామని ఆయన అంటారు. భాషతోనే కీర్తి, స్ఫూర్తి.. మానవీయబాటకు బాసటగా నిలుస్తామని కవిత్వంలో చెబుతున్నారు.

భాష పరిరక్షణ మన బాధ్యత



మాతృభాషలో విద్యాబోధన కొనసాగినప్పుడే విద్యార్థులకు చక్కగా అర్థమవుతుంది. విద్యార్థులు కూడా తమ మనసులోని భావాలను మాతృభాషలోనే వివరంగా వ్యక్తపరుచగలుగుతారు. వ్యవహారిక భాష అంటే ప్రజలు తమ నిత్య వ్యవహారంలో ఉపయోగించే భాష.

– కొండూరి పోతన్న, తెలుగు ఉపాధ్యాయులు, కవి, బోరిగాం, మం. సారంగాపూర్

నిధులొచ్చాయ్..!


వృత్తివిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

- వృత్తివిద్య కోర్సుల కోసం విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 29 పాఠశాలల్లో కోర్సులు అమలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బడుల్లో నూతన హంగులు సమకూర్చాలనే ఉద్దేశంతో పీఎంశ్రీ అమల్లోకి తెచ్చింది. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు చర్యలు చేపట్టింది. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి విద్యాభ్యాసం పూర్తి కాగానే ఉద్యోగవకాశాలు పొందేలా తోడ్పాటునందించనున్నారు.

29 పాఠశాలల్లో..

రాష్ట్రంలోని 88 కేజీబీవీలు, 14 గురుకుల విద్యాలయాల్లో 2023 -24 విద్యా సంవత్సరంలో వృత్తివిద్య కోర్సులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులకుగాను నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు బోధిస్తుండగా సామగ్రి, విద్యార్థుల బోధనకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఎన్ఎస్‌డీసీ సహకారంతో..

జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సహకారంతో వృత్తివిద్య కోర్సులను ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. వృత్తివిద్య కోర్సుల నిర్వహణ వొకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్(వీటీపీ)కు అప్పగించారు. ఆయా సంస్థల నిపుణులైన శిక్షకులను నియమించి తరగతులు ప్రారంభించారు. పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు అమలు చేస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్ -1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా వృత్తివిద్య కోర్సులు బోధిస్తున్నారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. మిగితా రెండు దశలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేయనున్నారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా వ్యవసాయం, బ్యూటీపార్లర్, దుస్తులు మేడ్ అప్‌లు, గృహోపకరణాల అలంకరణ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ టెక్నాలజీ, ప్లంబర్, క్రీడలు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన సామగ్రి కొనుగోలుకు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన జిరాక్స్‌లు తీసుకునేందుకు నిధులు మంజూరయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	సామగ్రి కొనుగోలు	జిరాక్స్ (వర్క్‌బుక్స్, హ్యాండ్‌బుక్స్)
ఆదిలాబాద్	06	రూ.2,35,000	రూ.45,000
కుమురంభీం	07	రూ.1,88,000	రూ.35,000
మంచిర్యాల	12	రూ.4,23,000	రూ.70,000
నిర్మల్	04	రూ.1,41,000	రూ.25,000

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి గత 15 సంవత్సరాల క్రితం నిర్మల్‌కు వచ్చి స్థానిక గాజుల్‌పేట్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే స్థిరపడి 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోక జల్సాలకు అలవాటు పడి రాత్రి 1 గంట నుంచి ఉదయం 4 గంటల సమయంలో రెక్కీ నిర్వహించి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో జూలై 5న కిల్లా గుట్ట, జూలై 12న సోమవార్ పేట్, జూలై 22న పింజారి గుట్ట, ఈనెల 4న కురన్నపేట్, 18న ఖిల్లాగుట్ట ఇలా వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. గతేడాది అక్టోబర్‌లో ఖానాపూర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. క్లూస్ టీం సభ్యులు దొంగతనం చేసిన చోట మహ్మద్ అబ్బాస్ వేలిముద్రలు దొరకడంతో నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి హర్యాన, నాందేడ్ పోలీసుల సహకారంతో హర్యాన నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారందరిని విచారించారు. అబ్బాస్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని గుర్తించి అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద 150 గ్రాముల గంజాయి, 2 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయించే వారిపై, దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టామన్నారు. ఇళ్లు, దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రమేశ్, సాయికష్ణ, రవి, గోపి, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రమేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా 'గోదావరి' హారతి

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి నదీ హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రతీ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు గోదావరి నది ఘాట్1 వద్ద గోదావరి హారతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గోదారమ్మకు అభిషేకం, అర్చన, హారతి ప్రత్యేక పూజలు చేశారు. సనాతన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చైర్మన్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ఈవో విజయ రామారావు ఉన్నారు.

వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్‌లు, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీఏఎస్ ఆర్ఎంవో, సీఏఎస్ సీఎంవో పోస్టులను భర్తీ చేయనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 4న రిమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్ adilabad. telangana. gov. in లేదా rimsadilabad. org లేదా ఫోన నంబర్లు 08732 -359573, 98480 57606, 94400 57799లలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఇద్దరు మృతి


శ్యాంరావు (ఫైల్)


సంతోష్ (ఫైల్)

మామడ: మండలంలోని తాండ్ర సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వస్తాపూర్ గ్రామానికి చెందిన శ్యాంరావు (47), సంతోష్(25)లు ద్విచక్రవాహనంపై వస్తాపూర్ నుంచి తాండ్రకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆడే సంతోష్, ట్రాక్టర్ డ్రైవర్ ఆడే గంగాప్రసాద్‌లు సొంత అన్నదమ్ములు. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టిన గంగాప్రసాద్, ప్రమాదం అనంతరం ట్రాక్టర్‌ను నిలపకుండా వెళ్లిపోయాడు. ఉదయం పంటచేలకు వెళ్లే వారు ప్రమాదాన్ని చూసి సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్‌లు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్ సాయి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన 8 మంది బాక్సింగ్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైయ్యారని ఆదిలాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేగ్, శిక్షకుడు సాయి బుధవారం తెలిపారు. వీరు ఈనెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఆర్ఈసీ బాక్సింగ్ టాలెంట్ హంట్ -సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్ 17 విభాగంలో నిహారిక, భగత్, అండర్ 14 విభాగంలో అనూష, అశ్విని, రామ్ చరణ్, షోయబ్ మాలిక్, నిఖిల్, పవన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. వీరు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు.